సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 28 । మార్చి । 2025



పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు..

యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ అధికారులను ఆదేశించారు. IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.28

సహర్ (శనివారం ఉ॥) 4.49

వాతావరణం

గరిష్టం / కనిష్టం 41°/ 22°

జిల్లాలో శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగి, సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకళ్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

డిజిటల్ పేమెంట్లతో సమయం ఆదా

విద్యుత్ ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ బిల్లులను డిజిటల్ పేమెంట్ల ద్వారా చెల్లిస్తే సమయం ఆదా అవుతుందని విద్యుత్ ఎస్ఈ జి.మహేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను టీజీ ఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు. యాప్ ద్వారా నెలవారీ బిల్లుల చెల్లింపు చాలా సులభం, సురక్షితమని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 67,695 మంది వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఎన్‌పీడీసీఎల్ యాప్, థర్డ్‌పార్టీ యాప్‌లు గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎంల ద్వారా చెల్లిస్తున్నారని వివరించారు. వేసవికాలం కావడంతో బయటకు వెళ్లకుండా, డిజిటల్ పేమెంట్లు చేయాలని కోరారు.

బడ్జెట్‌లో తీపి కబుర్లు



యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మారనున్న కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల

- కొత్తగూడెంలో యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌కు గ్రీన్ సిగ్నల్
- కొత్తగూడెం కార్పొరేషన్, కల్లూరు మున్సిపాలిటీల బిల్లు ఆమోదం
- భద్రాద్రికి నిధుల విడుదల, ఇల్లెందుకు దక్కిన సీతారామ హామీ
- బడ్జెట్ సమావేశాల్లో ఉమ్మడి జిల్లాకు వరాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాల విభజనకు ముందు తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాల్లో మెదక్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలను మినహాయిస్తే ప్రతీ జిల్లాలో ఒక యూనివర్సిటీ స్థాపన జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేయాలనే డిమాండ్ రాష్ట్ర విభజన ముందు నుంచే వినిపిస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో గిరిజన యూనివర్సిటీని ఈ జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినా అది ములుగు జిల్లాకు తరలిపోయింది. దీంతో కొత్తగూడెంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని మైనింగ్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ తెర మీదకు వచ్చింది. ఈ డిమాండ్ నాయకులు, ప్రజల నోళ్లలో నానుతుండగానే జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగంలో పలు ఇంజనీరింగ్ కాలేజీలు తెలంగాణలో వచ్చాయి. దీంతో మైనింగ్ వర్సిటీ డిమాండ్ సైతం ప్రాభవం కోల్పోయింది. అయితే ఈ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయడంతో మరోసారి యూనివర్సిటీ అంశం తెర మీదకు వచ్చింది.

సీఎం రేవంత్‌రెడ్డి హామీ

కొత్తగూడెంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు జరుగుతాయంటూ శాసన మండలిలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు యూనివర్సిటీ రావడం ఖాయమైంది. సింగరేణి బొగ్గు గనులను దృష్టిలో ఉంచుకుని ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న మైనింగ్ విభాగాన్ని 1978లో కొత్తగూడెం తరలించారు. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా మార్చారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా వేలాది మంది ఇంజనీర్లు ఈ కాలేజీ నుంచి బయటకు వచ్చి దేశ మైనింగ్ అవసరాలకు ఉపయోగపడ్డారు. నిధుల కొరత, పర్యవేక్షణ లేమి, అధ్యాపకులు రాకపోవడం, ల్యాబుల ఆధునీకీకరణ ఆగిపోవడంతో కొన్నేళ్లుగా ఈ కాలేజీ ప్రాభవాన్ని కోల్పోతోంది. ప్రస్తుతం యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించడంతో మరోసారి ఈ కాలేజీకి గత వైభవం రానుందనే నమ్మకం కలిగింది. సుమారు 400లకు పైగా ఎకరాల్లో కళాశాల క్యాంపస్ విస్తరించి ఉంది. ఈ కాలేజీ భూముల్లోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జిల్లా అధికారుల సమీకృత కార్యాలయాల భవనం (కలెక్టరేట్) నిర్మించారు.

నిధుల విడుదల

దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలం పట్టణంలో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. తెలంగాణ వచ్చాక భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తామంటూ అప్పటి సర్కారు ప్రకటన చేసింది. అయితే ఇది ఒక పట్టాన అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రధాన ఆలయం చుట్టూ మాడ వీధుల విస్తరణ ఇతర అభివృద్ధి పనుల కోసం కేటాయించిన రూ.60 కోట్లలో రూ.34 కోట్లు విడుదల అయ్యాయి. ఇక పర్యాటక శాఖపై జరిగిన చర్చలో కిన్నెరసాని, కనకగిరి గుట్టలు, భద్రాచలం దగ్గర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య చేసిన ప్రయత్నాలు విఫలం కావడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై అసెంబ్లీలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రస్తావించారు. దీంతో గుమ్మడికి సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడమే కాకుండా బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇల్లెందు–సీతారామ అంశంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

కార్పొరేషన్ బిల్లు ఆమోదం

కొత్తగూడెం – పాల్వంచ – సుజాతనగర్‌లను ఒక్కటిగా చేస్తూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు గత జనవరి 4న రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. తదుపరి కార్యాచరణలో భాగంగా ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో కొత్తగూడెం కార్పొరేషన్ బిల్లును మార్చి 18న అసెంబ్లీలో ప్రవేశపెట్టగా ఆ తర్వాత జరిగిన చర్చలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమోదం పొందింది. మరోవైపు ఇదే బడ్జెట్‌లో నగరాభివృద్ధి పద్దు కింద కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించారు. మరోవైపు కల్లూరుకు మున్సిపాలిటీ హోదా దక్కింది.

'బార్' అధ్యక్షుడిగా లక్కినేని

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్కినేని సత్యనారాయణ విజయం సాధించారు. గురువారం ఎన్నికలు నిర్వహించగా, అధ్యక్ష పదవికి ఎస్.వెంకటరాజేష్, అనుబ్రోలు రాంప్రసాద్, లక్కినేని సత్యనారాయణ, కె. వెంకటేశ్వరావు, జీ.రాంమూర్తి పోటీ పడ్డారు. లక్కినేని సత్యనారాయణ తన సమీప ప్రత్యర్థిపై 12 ఓట్ల తేడాతో గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్‌గా గోపికృష్ణ 18 ఓట్లు, జనరల్ సెక్రటరీగా భాగం మాధవరావు 4 ఓట్లు, ట్రెజరర్‌గా చిన్నకృష్ణ ఐదు ఓట్లు, స్పోర్ట్స్ సెక్రటరీగా ఉప్పు అరుణ్ 14 ఓట్ల మెజారిటీతో గెలిచారు. జాయింట్ సెక్రటరీగా కె.రమేష్, లైబ్రరీ సెక్రటరీగా ఎం.ప్రసాద్, లేడీ రిప్రెజెంటివ్‌గా ఏ.పార్వతి ఎన్నికయ్యారు. విజేతలు కొత్తగూడెం కోర్టు ఆవరణలో రంగులు చల్లుకుని స్వీట్లు పంచుకున్నారు. పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తనపై నమ్మకం ఉంచి మళ్లీ గెలిపించినందుకు అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.




కొత్తగూడెం కోర్టు ఆవరణలో సంబురాలు జరుపుకుంటున్న విజేతలు లక్కినేని సత్యనారాయణ, మాధవరావు తదితరులు

అడ్రస్ లేని ఐకానిక్



- అమలుకు నోచని రామాలయం–గోదావరి మధ్య వంతెన
- యాదగిరిగుట్టతో పాటే భద్రాచలం అభివృద్ధికీ ప్రణాళిక
- పదేళ్ల క్రితమే సస్పెన్షన్ బ్రిడ్జి డిజైన్లు ఇచ్చిన ఆర్ట్ డైరెక్టర్
- కనీసం తీగల వంతెనైనా నిర్మించాలంటున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అప్పుడెప్పుడో పోకల దమ్మక్క భద్రగిరి కొండపై కొలువైన సీతారాములకు తాటాకు పందిళ్లతో నీడ కల్పించింది. ఆ తర్వాత భక్త రామదాసు ఆలయాన్ని నిర్మించడమే కాక.. సీతమ్మకు చింతాకు పతకం చేయించారు. ఆ తర్వాత క్రమంలో వచ్చిన రాజులు, పాలకులు, ప్రభుత్వాలు ఇటు ఆలయ అభివృద్ధికి, అటు భద్రాచలంలో భక్తుల కోసం ఒక్కో సౌకర్యం కల్పిస్తూ వచ్చారు. ఇందులో చెప్పుకోదగినవిగా గోదావరి నదిపై వంతెన, మిథిలా స్టేడియం, కరకట్ట కనిపిస్తున్నాయి. అయితే గడిచిన రెండు దశాబ్దాలుగా భద్రాచలం ముఖచిత్రాన్ని మార్చేయదగ్గ అభివృద్ధి మాత్రం జరగలేదు.



యాదగిరిగుట్టతో పాటే..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత యాదగిరిగుట్ట ఆలయానికి డిజైన్లు చేసిన ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయితో భద్రాచలం అభివృద్ధికీ అప్పటి ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి ఆలయ సంప్రదాయాలు, ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు సూచనలు చేశారు. అందులో ఆలయం నుంచి గోదావరి తీరం వరకు కొత్తగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే ఆ తర్వాత కాలంలో ఈ సూచనలు బుట్టదాఖలయ్యాయి.

లక్నవరం టు దుర్గం చెరువు

పదిహేనేళ్ల క్రితం అప్పటి వరంగల్ జిల్లాలో దట్టమైన అడవిలో కొండల మధ్యన ఉన్న లక్నవరం చెరువులో సస్పెన్షన్ బ్రిడ్జి (తీగల వంతెన) నిర్మించారు. ఈ వంతెన నిర్మాణం తర్వాత లక్నవరానికి పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగింది. టూరిస్టుల రద్దీని తట్టుకునేందుకు వీలుగా రెండో వంతెన నిర్మించాల్సి వచ్చింది. అలాగే కాటేజీల సంఖ్య ఎనిమిది నుంచి నలభైకి పెరిగింది. ఇప్పటికీ సెలవు రోజుల్లో వేలాది మంది పర్యాటకులు లక్నవరం వస్తున్నారంటే అందుకు ప్రధాన కారణం తీగల వంతెనే అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆ తర్వాత కాలంలో సిద్ధిపేట కోమటి చెరువు, ఖమ్మంలో లకారం చెరువుతో పాటు రాష్ట్రంలో అనేక చోట్ల తీగల వంతెనలు నిర్మించారు. హైదరాబాద్‌లో దుర్గం చెరువు, కరీంనగర్‌లో మానేరు నదిపై భారీ స్థాయిలో తీగల వంతెనలు నిర్మించే వరకు ఈ క్రేజ్ వచ్చింది.

భద్రగిరి అభివృద్ధికి మార్గం..

టెంపుల్ టూరిజంలో భాగంగా భద్రాచలంలో ఆలయం నుంచి గోదావరి కరకట్ట వరకు సస్పెన్షన్ బ్రిడ్జి (తీగల వంతెన) నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. భద్రాచలం వచ్చిన భక్తుల్లో చాలా మంది సీతారాముల దర్శనానికి ముందు పావన గోదావరిలో స్నానం ఆచరించడం, అక్కడ పూజాదికాలు నిర్వహించడం ఆనవాయితీగా భావిస్తారు. మరికొందరు దర్శనం చేసుకున్న తర్వాత గోదావరి తీరానికి వెళ్లి నదిలో నీటిని తలపై చల్లుకుంటారు. అందువల్ల ఆలయం నుంచి కరకట్ట వరకు నడుచుకుంటూ వెళ్లేందుకు వీలుగా ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మిస్తే భద్రాచలం క్షేత్రానికి కొత్త శోభ వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. భద్రాచలం అభివృద్ధి కోసం ప్రస్తుతం రూపొందిస్తున్న ప్రతిపాదనల్లో సస్పెన్షన్ బ్రిడ్జికి చోటు కల్పించాలనే డిమాండ్‌కు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది.

కన్నీటి వేదన..





శిథిలాల నుంచి వెలికితీసిన మృతదేహం, (ఇన్‌సెట్) పడిసాల ఉపేందర్(ఫైల్)

- విషాదంగా మారిన భవనం కూలిన సంఘటన
- శిథిలాల కింద పడి ఇద్దరు కార్మికుల మృతి
- గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగిన సహాయక చర్యలు
- బంధువుల ఆందోళనతో భద్రాచలంలో ఉద్రిక్త పరిస్థితి

భద్రాచలం అర్బన్: భవన నిర్మాణ కార్మికుల కుటుంబ సభ్యుల రోదనలు, బంధువుల ఆందోళనలతో భద్రాచలంలో విషాదం నెలకొంది. మరో వైపు రెస్క్యూ బృందాల సహాయక చర్యలు చేపట్టాయి. మండుటెండల్లో కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణలతో శిథిలాల తొలగింపు పనులు సాగించారు. భద్రాచలంలో ఐదు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కింద ఇరుక్కుపోయిన ఇద్దరు కార్మికులను వెలికితీశారు. చల్లా కామేశ్వరరావును బుధవారం అర్ధరాత్రి 1.47 గంటలకు బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 2.20 గంటలకు మృతి చెందాడు. 12 గంటల పాటు మృత్యువుతో పోరాడిన కార్మికుడు ఆస్పత్రికి తరలించిన కొంతసేపటికే తనువు చాలించాడు. సహాయక చర్యలను కొనసాగించిన ఎన్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి, విపత్తుల నివారణ శాఖ సిబ్బంది గురువారం అర్ధరాత్రి 1.42 గంటలకు మరో కార్మికుడు పడిసాల ఉపేందర్ మృతదేహాన్ని వెలికితీశారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోయే స్థితికి చేరింది. అనంతరం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుటుంబీకులు, బంధువుల ఆందోళన

ఉపేందర్ ఆచూకీ ఆచూకీ గుర్తించడంలో అధికారులు విఫలయ్యారని ఆరోపిస్తూ మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. బాధితుల కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది.

అర్ధరాత్రి వరకు రెస్క్యూ

కార్మికుడు ఉపేందర్ ఆచూకీ కోసం గురువారం అర్ధరాత్రి వరకు రెస్క్యూ కొనసాగించారు. ఉదయం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది స్నిపర్ డాగ్‌తో ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నించినా ఫలితం రాలేదు. దీంతో కుప్పకూలిన ఐదు స్లాబులకు క్రేన్ల సాయంతో డ్రిల్ వేస్తూ శిథిలాలను తొలగించారు. ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సహాయక చర్యలను పర్యవేక్షించారు. శిథిలాలను తొలగించే క్రమంలో ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్‌కు చెందిన ఓ లాకర్ బయట పడగా, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రి 7 గంటల సమయంలో భవన ప్రవేశ ద్వారం వైపు నుంచి దుర్వాసన రాగా, ఆ దిశగా శిథిలాల తొలగింపు పనులు చేపట్టి అర్ధరాత్రి ఉపేందర్ మృతదేహాన్ని గుర్తించారు.

విషాద ఛాయలు

ఇద్దరు కార్మికుల మృతితో భద్రాచలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు కామేశ్వరరావు అవివాహితుడు. ఏడాది క్రితం తండ్రి మృతి చెందడంతో తల్లి రేవతి తానే సాకుతున్నాడు. ఇద్దరు అక్కలు ఉన్నారు. కాగా కామేశ్వరరావు మృతి చెందడటంతో తల్లి ఒంటరిగా మారింది. మరో మృతుడు ఉపేందర్‌కు భార్య రమాదేవి, కుమారుడు జశ్వంత్, కుమార్తె నందుశ్రీ, ఉన్నారు. బుధవారం నుంచి గురువారం అర్ధరాత్రి వరకు సంఘటనా స్థలంలో వారు రోదించిన తీరు చూపరులను కలిచివేసింది. కాగా పలువురు రాజకీయ నాయకులు బాధితులను పరామర్శించారు.

ఈ దుర్ఘటనకు బాధ్యులెవరు? IIలో

యజమానుల జాడెక్కడ..?

భద్రాచలంలో భవనం కూలిన ఘటనలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నిద్ర లేకుండా రెండు రోజులుగా శ్రమిస్తున్నారు. కానీ కార్మికుల మృతికి బాధ్యత వహించాల్సిన ఆ ఇంటి యజమానులైన భార్యాభర్తల జాడ మాత్రం లేదు. బుధవారం ఘటన జరిగిన అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్టు ప్రచారం జరిగినా, పోలీసులు మాత్రం వారు లొంగిపోయారా.. అరెస్ట్ చేశారా? అనే వివరాలు వెల్లడించలేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ, ఇష్టారీతిగా నిర్మాణాలు సాగించిన వారిపై కేసు నమోదు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే..



అధికారుల నిర్లక్ష్యం కారణంగా నా భర్త ఉపేందర్ శిథిలాల కింద పడి మృతి చెందాడు. ఈ ఘటనకు అధికారులు బాధ్యత వహించి మా ఇంట్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలి. రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలి. మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

– పడిసాల రమాదేవి, ఉపేందర్ భార్య, లంబాడీ కాలనీ, భద్రాచలం

కొడుకు సంపాదన మీదనే..



గత ఏడాది నా భర్త మృతిచెందాడు. ఇప్పుడు నా కొడుకు కామేశ్వరరావు కూడా నన్ను వదిలేసి వెళ్లిపోయాడు. కొడుకు సంపాదన మీదనే బతుకుతున్నాను. అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లుతోపాటు నష్టపరిహారం రూ. కోటి ఇవ్వాలి.

– చల్లా రేవతి, కామేశ్వరరావు తల్లి, జగదీష్‌కాలనీ, భద్రాచలం

గతంలో 13మందిని కాపాడాం



బొగ్గు గనుల్లో ప్రమాదాలు జరిగితే లేయర్స్ ప్రకారం రెస్క్యూ చేసుకుంటే వెళ్తాం. వాటితో ఈ ప్రమాదాన్ని పోల్చలేం. ఇది ఆర్‌సీసీ స్ట్రక్చర్ కాబట్టి రెస్క్యూ ఆపరేషన్ నమ్మకశ్యంగా చేయొచ్చు. గతంలో కారేపల్లిలో ఓ కళాశాల కుప్పకూలిన ఘటనలో 13 మందిని కాపాడాం.

– అనంతరామయ్య, సింగరేణి రెస్క్యూ అడిషనల్ మేనేజర్, కొత్తగూడెం

ఇలాంటివి పెద్ద పట్టణాల్లోనే..



25 మంది సిబ్బంది, 10 మంది అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాం. వీఎల్ఎస్, కాంబి టూల్, హైడ్రాలిక్ కట్టర్, వంటి పరికరాలను రెస్క్యూలో ఉపయోగిస్తున్నాం. సాధారణంగా ఇలాంటి ఘటనలు పెద్ద పట్టణాల్లోనే చూస్తాం. కాగా మొదటి సారి ఇలాంటి ఘటనలో పాల్గొంటున్నాను.

–క్రాంతి కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి

ఈ దుర్ఘటనకు బాధ్యులెవరు?

- ఈ దుర్ఘటనకు బాధ్యులెవరు?
- ఐదంతస్తుల భవనం కూలి రెండు కుటుంబాలు ఆగం
- బలహీన పునాదిపై బహుళ అంతస్తుల భవన నిర్మాణం
- కార్మికులకు శాపంగా మారిన అధికారుల అలసత్వం!


కుప్పకూలిన భవనం శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

భద్రాచలం: పొట్టకూటి కోసం భవన నిర్మాణ పనులకు వెళ్లిన ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఐదంతస్తుల భవనం కూలి శిథిలాల కింద పడి ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డారు. దీంతో ఈ దుర్ఘటనకు బాధ్యులెవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బలహీనమైన పునాదిపై అధికారులు, స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా పెడచెవిన పెట్టిన ఇంటి యజమానిదా..? కళ్ల ముందే పేకమేడలా గిరిజన చట్టాలు, నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టానురీతిగా నిర్మాణం చేస్తున్నా నోటీసులతో సరిపెట్టిన అధికారులదా? సత్వరమే చర్యలు తీసుకోలేని ఉన్నతాధికారులదా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వస్తున్నాయి. వీరందరి అలసత్వం, నిర్లక్ష్యం వల్లే రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ఉన్నతాధికారుల అలసత్వానికి..

బహుళ అంతస్తుల భవనం బుధవారం కుప్పకూలిన సంఘటనలో యజమాని నిర్లక్ష్యంతోపాటు అందరి అలసత్వమూ కనిపిస్తోంది. గతేడాది జూలైలోనే నిబంధనలకు విరుద్ధంగా ఐదో అంతస్తు నిర్మాణం జరుగుతుండటంతో స్థానిక ఆదివాసీ నాయకులు పంచాయతీ ఈఓకు ఫిర్యాదు చేయటంతో... ఆయన ఆ అంతస్తు శ్లాబు సమయంలో పనులు నిలిపివేయించారు. ఆ తర్వాత గ్రామపంచాయతీ అధికారుల ఆదేశాలను పెడచెవిన పెట్టిన ఆ ఇంటి యజమాని శ్లాబు పనులు పూర్తి చేశాడు. ఈ క్రమంలో గిరిజన సంఘ నాయకులు ఐటీడీఏ పీఓ, కలెక్టర్, డీఎల్‌పీఓ, మానవ హక్కుల సంఘానికి సైతం ఫిర్యాదులు అందించారు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు గతేడాది జూలై నుంచి సదరు ఇంటి యజమానికి నోటీసులను అందజేస్తున్నారు. మూడు అంతస్తులను కూలగొట్టాలని, లేని పక్షంలో వాటిని కూలగొట్టి సదరు ఖర్చును రికవరీ చేస్తామని ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే నోటీసుల వరకు మాత్రమే పరిమితం కావడంతో సదరు ఇంటి యజమాని గత 15 రోజుల నుంచి పనిని తిరిగి ప్రారంభించాడు. అలా కాకుండా జిల్లా ఉన్నతాధికారులే చొరవ తీసుకుని వివాదాస్పదంగా ఉన్న భవన నిర్మాణాన్ని పరిశీలించి, కూలగొడితే.. ఇప్పుడు రెండు కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేవి. ప్రభుత్వం సైతం బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించకపోవడంపై రాజకీయ పార్టీలు, వివిధ కుల, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.


శిథిలాల తొలగింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

అభివృద్ధి గిరిజన చట్టాలకు లోబడే ఉండాలి..

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న భద్రాచలంలో గిరిజన, గిరిజనేతర జనాభా క్రమంగా పెరుగుతోంది. ఏజెన్సీలో 1/70 యాక్ట్ పరిధిలో ఉండటంతో ఆ చట్టాలకు అనుగుణంగానే అభివృద్ధి సాగుతోంది. అయితే గిరిజన, గిరిజనేతరులకు నివాస సౌలభ్యం కోసం ఇంటి నిర్మాణాలకు పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయనప్పటికీ ఇటీవల కాలంలో భద్రాచలంలో ఇంటి నిర్మాణాల పేరిట లాడ్జీలను పెద్ద ఎత్తున నిర్మించడం ఆందోళనకు గురిచేస్తోంది. జీప్లస్ టూ కు మాత్రమే అనుమతులున్నా, పట్టాలు కలిగిన భూములకు నిబంధనల సడలింపు ఉంది. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ జరిగే నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గిరిజన చట్టాలకు లోబడే భద్రాచలం పట్టణ అభివృద్ధి జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన చట్టాలకు విఘాతం లేకుండా..



ఏజెన్సీ చట్టాలకు లోబడి అభివృద్ధికి ప్రభుత్వం నడుం బిగించాలి. గిరిజన, గిరిజనేతరులకు లాభం చేకూరేలా, గిరిజన చట్టాలకు విఘాతం కలుగకుండా చూడాలి. అధికారుల అలసత్వానికి, నిర్లక్ష్యానికి అమాయకుల ప్రాణాలు కోల్పోకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.

– పూనెం ప్రదీప్ కుమార్, మానవ హక్కుల సంఘం నాయకులు

క్లుప్తంగా

ఆకట్టుకున్న 'అంతరిక్ష నమూనా'


ప్రదర్శనను ప్రారంభిస్తున్న నరేష్, చలపతి రాజు

పాల్వంచ: పట్టణంలోని కేఎల్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన అంతరిక్ష నమూనా ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనంలో 40కి పైగా అంతరిక్ష, రక్షణ నమూనాలను ప్రదర్శించగా.. ఎక్సలెన్స్ వ్యవస్థాపకుడు నరేష్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక, దేశాభివృద్ధికి ఉపయోగపడేలా ప్రతీ అంశాన్ని అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.నాగమణి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.1,00,116 విరాళం


విరాళం అందిస్తున్న రవి దంపతులు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన కమటం హుస్సేన్ జ్ఞాపకార్థం ఆయన మనవడు కమటం రవి–రజిత దంపతులు గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈమేరకు రవి దంపతులకు ఆలయ నిర్మాణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణిలో మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 11 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఇద్దరు డీవైజీఎంలు, ఇద్దరు సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్, ఇద్దరు అడిషనల్ మేనేజర్లు, ఒక ఎస్ఈ, ఇద్దరు డీవైఎస్ఈలు, ఇద్దరు అండర్ మేనేజర్లు ఉన్నారు. వీరు ఏప్రిల్ 7 కల్లా వారికి కేటాయించిన ఏరియాలో విధుల్లో చేరాల్సి ఉంది.

సింగరేణిలో సర్వే ఆఫీసర్ల బదిలీ..

సింగరేణిలో వివిధ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న 11 ఏరియాల్లోని సర్వే అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఇద్దరు డీవైజీఎం సర్వే ఆఫీసర్లు, ఇద్దరు సీనియర్ సర్వే ఆఫీసర్లు, మరో 7గురు సర్వే ఆఫీసర్లు ఉన్నారు. వీరందరు ఏప్రిల్ 6 కల్లా విధుల్లో చేరాల్సి ఉంది.

ఇల్లెందుకు 'సీతారామ' నీటిని తరలించాలి

ఎమ్మెల్యే కోరం కనకయ్య


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు, మహబూబాబాద్ నియోజకవర్గాలకు అందించాలని గతంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య వినతి పత్రం ద్వారా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎం దృష్టికి తెచ్చారు. తాజాగా ఇల్లెందులో ఎన్డీ ఆధ్వర్యాన దశలవారీ ఆందోళనలు చేపడుతున్నట్లు ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం అసెంబ్లీలో సీతారామ ప్రాజెక్టు విషయం ప్రస్తావించారు. తన నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం రోళ్లపాడులో 2016లో నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి రిజర్వాయర్‌గా మార్చుతామని ప్రకటించాడని, ఆ తర్వాత ఆ ప్రాజెక్టు అటవీశాఖ అనుమతులు లేవని, రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉందని, ప్రాజెక్టును రిజర్వాయర్‌గా మార్చలేమని ఎత్తివేశారు. ఇక ఏన్కూర్ నుంచి చీమలపాడు మీదుగా లలితాపురం చెరువు వరకు నీటిని తరలించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని గత ప్రభుత్వంలో పలు దఫాలు అధికారులు ప్రకటించారు. కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ తరుణంలో సీతారామ అంశాన్ని, ఇల్లెందుకు గోదావరి నీటిని తరలింపు అంశాన్ని ఎమ్మెల్యే కనకయ్య ప్రస్తావించారు. కానీ ప్రభుత్వం మాత్రం నోట్ చేసుకున్నామంటూ మాత్రమే ప్రకటించింది. సంబంధిత శాఖ మంత్రి నుంచి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను గురువారం విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ప్రకటించారు. మొత్తం 80 సీట్లకు గాను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2625 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో అర్హత సాధించిన విద్యార్థుల హాల్ టికెట్ నంబర్ల వివరాలిలా ఉన్నాయి.

ఎన్ 3596585, బీ 3596589, బీ 3597185, కే 3597635, ఎఫ్ 3596247, ఎఫ్ 3596941, జే 3597808, జే 3597828, జే 3598088, ఓ 3595962, కే 3597817, ఓ 3597873, ఓ 3596215, పీ 3597360, జే 3598049, ఎల్ 3595493, డీ 3595942, ఎల్ 3597191, ఎల్ 3597986, ఎల్ 3598140, కే 3595343, ఎల్ 3595434, ఐ 3595764, ఎం 3596064, ఎం 3596065, ఐ 3596120, ఎల్ 3596417, కే 3596800, ఐ 3596893, ఎల్ 3597160, జే 3597386, జే 3597680, ఎస్ 3597784, ఎం 3597796, ఐ 3597924, ఎస్ 3598032, ఓ 3598273, జే 3598281, ఎల్ 3598318, జే 3595595, జే 3596162, జే 3596266, ఎస్ 3596345, ఎస్ 3596732, ఎస్ 3596745, జే 3596926, ఎస్ 3597153, జే 3597221, ఎస్ 3597274, ఎస్ 3597864, జే 3597920, జే 3597933, జే 3597944, జే 3597962, ఏ 3598360, కే 3596058, కే 3596102, కే 3596114, ఓ 3597822, కే 3597896, ఓ 3597899, కే 3597953, ఓ 3597958, ఓ 3597983, ఓ 3598289, ఎల్ 3595332, ఎల్ 3595335, పీ 3595352, ఎల్ 3595354, ఎల్ 3595447, పీ 3595483, పీ 3595789, పీ 3597170, ఎల్ 3597195, పీ 3597471, ఎల్ 3597936, ఎల్ 3597969, ఎల్ 3598217, ఎల్ 3598382, ఎల్ 3598396.

కనువిందు చేసేలా గిరిజన మ్యూజియం

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలతో గిరిజన మ్యూజియం పర్యాటకులకు కనువిందు చేసేలా ముస్తాబు చేశామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని గురువారం ఆయన సందర్శించి అందులోని పెయింటింగ్, కళాఖండాలు, వెదురుతో తయారుచేసిన కళారూపాలు, బాక్స్ క్రికెట్ గ్రౌండ్, గిరిజన వంటకాల కోసం తయారుచేస్తున్న స్టాళ్లను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామనవమి రోజున ఈ మ్యూజియాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో పెయింటింగ్‌తో పాటు గిరిజన తెగలకు చెందిన దేవతామూర్తులను ప్రతిష్ఠించడం పూర్తిచేసిన్నట్లు పేర్కొన్నారు. గోరు బంజారా సంప్రదాయానికి సంబంధించిన పెయింటింగ్ చిత్రాలతో పాటు మిగిలిన పనులు కూడా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని తెలిపారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన బోటింగ్ చెరువులో అందమైన పూల మొక్కలు, చిన్న చిన్న చేపల పెయింటింగ్ చిత్రాలు వేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, భాస్కర్, ప్రభాకర్‌రావు, పవర్ వేణు, హరీష్, హరికృష్ణ, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న పీఓ, అధికారులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన బహుమతులతో డిగ్రీ కళాశాల విద్యార్థులు

పాల్వంచరూరల్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జిల్లా స్పోర్ట్స్ అధికారి పరంధామరెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ఐదు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వాలీబాల్ పోటీలో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రథమ, షటిల్ పోటీలో బాలురు ప్రథమ, బాలికలు ద్వితీయ, అథ్లెటిక్స్ పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బహుమతులతో పాటు ధ్రువీకరణపత్రాలు అందించి మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, ఎంప్లాయ్‌మెంట్ అధికారి శ్రీరామ్, నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.భానుచందర్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, జాగృతి యూత్ అసోసియేషన్ సభ్యులు సయ్యద్ ఫరూక్, యూత్ క్లబ్ అధ్యక్షులు మురళీకృష్ణ, బానోతు వెంకట్‌లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1,84,502 మెట్రిక్ టన్నులు కాగా అందులో సన్నరకం 99,729 మెట్రిక్ టన్నులు, మిగిలినవి దొడ్డు రకం వస్తాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 144 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ. 2,300 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దులో ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు ధాన్యాన్ని ఏరోజుకు ఆరోజు ఆన్‌లైన్ చేసి రైస్ మిల్లులకు తరలించాలని, దిగుమతిలో జాప్యం లేకుండా మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సెంటర్ ఇన్‌చార్జ్, మిల్లర్‌పై చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రతీ రైతు ఆధార్, బ్యాంకు, పట్టాదారు పాస్‌పుస్తకం తమవెంట తీసుకురావాలని చెప్పారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పోస్టర్లు ఆవిష్కరణ..

ధాన్యం మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాలకు సంబంధించి మార్కెటింగ్ శాఖ రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఎం సివిల్ త్రినాథ్‌బాబు, డీఎస్ఓ రుక్మిణి, డీఏఓ బాబురావు, డీసీఓ ఖుర్షిద్, జీసీసీ మేనేజర్ విజయ్‌కుమార్, తూనికల, కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ బాధ్యులు ఆనందరావు, రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు.

'రాజీవ్ యువవికాసా'నికి దరఖాస్తు చేసుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని బీసీ, ఎంబీసీ, బీసీ ఫెడరేషన్ ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకానికి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, బత్రాజు, కృష్ణబలిజ, పూసల నగర, ఉప్పర, వాల్మీకి బోయ, కుమ్మరి, శాలివాహన, విశ్వబ్రాహ్మణ, మేదర, కల్లుగీత కార్మికులు, గంగపుత్ర, పెరిక, పద్మశాలి, మేర, ముదిరాజ్, మున్నూరుకాపు, యాదవ, లింగాయత్ కులాలకు చెందినవారు అర్హులని తెలిపారు. tgobmmsnow.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 నుంచి 55 సంవత్సరాలలోపు వారు అర్హులని, వ్యవసాయ సంబంధ వృత్తులకు 60 సంవత్సరాల వరకు అర్హత ఉందని వివరించారు.

జీపీఎఫ్ నగదు అందక..

- భార్యను కాపాడుకోలేకపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు
- అనారోగ్యంతో బాధపడుతూ మృతి

పాల్వంచరూరల్ : జీపీఎఫ్ నగదు అందని కారణంగా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యను కాపాడుకోలేకపోయాడు. చేతిలో డబ్బు లేక సరైన వైద్యం అందక ఆమె మృతి చెందింది. ఈ సంఘటన జిల్లా పాల్వంచలో గురువారం జరిగింది. పాల్వంచలోని వెంకటేశ్వర హిల్స్ కాలనీకి చెందిన పొదిలి సత్యనారాయణ స్థానిక కేటీపీఎస్ బాలికల హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య లత(52) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో వైద్యం చేయించేందుకు జీపీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఏడాది క్రితమే మంజూరైంది. కానీ ఇప్పటివరకు నగదు బ్యాంకు ఖాతాలో జమకాలేదు. దీంతో మెరుగైన వైద్యం అందించకపోవడంతో ఆమె మృతి చెందింది. దహన సంస్కారాల అనంతరం ఉపాధ్యాయులు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి మాట్లాడుతూ ఉపాధ్యాయుడి భార్య మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్ నగదు అందక మెరుగైన వైద్యం చేయించలేకపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే నగదు ఖాతాల్లో జమచేయాల్సి ఉందని, కానీ ఏడాది గడిచినా నగదు అందకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరాంమూర్తి, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, సంఘమేశ్వరరావు, ప్రభావతి, సుధాశ్రీ, మోతీలాల్, శంకర్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు


పొదిలి లత (ఫైల్)

చోరీ కేసులో అరెస్ట్

అశ్వాపురం: ఓ మేకపోతును దొంగిలించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో నల్లపాటి నారాయణకు చెందిన సుమారు రూ.16వేలు విలువ గల మేకపోతును అందే గ్రామానికి చెందిన సప్కా పవన్‌ను గురువారం దొంగిలించాడు. ఈక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యాన ఎస్సై రవూఫ్, పోలీసులు పవన్‌ను అరెస్ట్ చేసి మేకపోతు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్ట్ న్యాయమూర్తి వి.శివనాయక్ చెల్లని చెక్కు కేసులో నిందుతుడికి జైలు శిక్షను ఖరారు చేస్తూ గురువారం తీర్పు చెప్పారు. భద్రాచలం పట్టణానికి చెందిన పోతురాజు రామారావు వద్ద నుంచి అశ్వాపురానికి చెందిన హెవీ వాటర్ ప్లాంట్ ఉద్యోగి చిద్దిరాల గోవర్ధన్ చెక్కును హామీగా పెట్టి 2013 సంవత్సరంలో నగదు తీసుకున్నాడు. అప్పటి నుంచి నగదు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు చెక్కును బ్యాంకులో వేయగా.. అది చెల్లదని తెలింది. దీంతో న్యాయవాది రామారావు సహకారంతో కోర్టును ఆశ్రయించగా.. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి గోవర్ధన్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.8 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా తరలిస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై టి.యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ శివారులో గురువారం వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో దమ్మపేట వైపు వెళ్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. అదే విధంగా ట్రాక్టర్ డ్రైవర్ వల్లపు లక్ష్మయ్య, ట్రాక్టర్ యజమాని వల్లపు రమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


సాగర్ (ఫైల్)

కరకగూడెం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మోతే గ్రామానికి చెందిన నైనారపు సాగర్ (30) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యాన ఈనెల 9న ఇంటి వద్ద కుటుంబసభ్యులతో గొడవపడి క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. దీంతో అతడికి కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి మణుగూరు వైద్యశాలకు, చివరకు వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఇటీవల అతడు ఇంటికి తీసుకుని రాగా గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి


మృతి చెందిన ఆర్యన్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండా గ్రామపంచాయతీ ఎల్లన్ననగర్ గ్రామంలో ఆటాడుకుంటున్న ఏడాదిన్నర వయసు గల ఓ బాలుడు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను కుటుంబసభ్యులు ఇలా తెలిపారు. గ్రామంలో వాంకుడోత్ రాములు తన ట్రాక్టర్‌ను ఇంట్లో ఓ పక్కకు పెట్టే ప్రయత్నంలో అక్కడే ఆడుకుంటున్న రాములు సోదరుడు శ్రీకాంత్– కల్యాణి దంపతుల కుమారుడు ఆర్యన్ మీదకు ఎక్కించాడు. దీంతో కుటుంబసభ్యులు బాలుడిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి బాలుడి భౌతికకాయాన్ని మార్చురీకి తరలించారు. కనుల ముందు అల్లారుముద్దుగా ఆడుకుంటున్న బాలుడు హఠాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది.

చికిత్స పొందుతున్న మహిళ..


సామ్రాజ్యం(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన మామిడి సామ్రాజ్యం(40) పురుగుమందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆర్థిక ఇబ్బందులతో సామ్రాజ్యం గత రెండు రోజుల క్రితం పురుగుమందు తాగింది. అస్వస్థతకు గురికావడంతో ఆమెను కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈమేరకు మృతదేహానికి మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

సత్తుపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం కాకర్లపల్లి లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి చెందిన మట్ట వెంకటేశ్వరరావు (35) ద్విచక్ర వాహనంపై సత్తుపల్లిలోని ఒక షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న తన భార్యను తీసుకెళ్లేందుకు వస్తున్నాడు. ఈ క్రమంలో కాకర్లపల్లి శివారులోని పాత ఎన్టీఆర్ కాలువ వంతెన సమీపంలో ఓ పానీపూరి బండిని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇతడు పెయింటర్ గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య భవాని, ఒక కుమార్తె ఉన్నారు.

గుండెపోటుతో హఠాన్మరణం

- మృతుడు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వాసి


బండి రామకృష్ణ మృతదేహం

టేకులపల్లి: మండలంలోని కారుకొండ క్రాస్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం ఖమ్మం పాడుకు చెందిన బండి రామకృష్ణ(48) గురువారం కారుకొండ క్రాస్ రోడ్ వద్ద గల జామాయిల్ యార్డ్ వద్దకు వచ్చి నీళ్లు తాగాడు. అక్కడే చాప వేసుకుని కాసేపు నిద్రపోయాడు. ఆ తర్వాత ఒక్కసారిగా లేచి 'నాకు ఊపిరి ఆడడం లేద'ంటూ అరుస్తూ కింద పడిపోయాడు. స్థానికులు ఎంత ప్రయత్నం చేసినా స్పందించకపోవడంతో 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించి మృతిచెందాడని నిర్ధారించారు. అతడి వద్ద ఉన్న మొబైల్ ఆధారంగా వివరాలు తెలుసుకున్నారు. మృతుడి వెంట ట్యాబ్లెట్లు, బట్టలు ఉన్నాయని, మృతదేహాన్ని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించామని ఎస్ఐ తెలిపారు.

సాక్షి
ఫ్యామిలీ
ఖమ్మం
శుక్రవారం ॥ 28-3-2025

పేరెంటింగ్

ఐఏఎస్ అధికారిణి, ఇద్దరు పిల్లల తల్లి అయిన దివ్య మిట్టల్
ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేసింది.
'నేను ఒక ఐఏఎస్ అధికారిణి ని.
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీలో,
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) బెంగళూరులో చదివాను.
వీటిని సాధించడానికి చాలా కష్టపడ్డాను.
కానీ, నా ఇద్దరు చిన్నారి కూతుళ్లను పెంచే క్రమంలో
సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదీ నన్ను సిద్ధం చేయలేదు..'
అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది.
ఇటీవల కాలంలో ఉద్యోగం చేసే అమ్మల శాతం పెరుగుతోంది.
అదే సమయంలో పిల్లల పెంపకం పట్ల సరైన జాగ్రత్తలు
తీసుకుంటున్నామా అనే ఆందోళనా పెరుగుతోంది.
కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను
నేటి తల్లులు ఎలా సమతుల్యతను సాధించాలో నిపుణులు సూచిస్తున్నారు.



ఆఫీసులో అమ్మ... ఇంట్లో బిడ్డ

వయస్సుతో సంబంధం లేకుండా కష్టాల్లో ఉన్నప్పుడు మనం 'అమ్మా' అని పిలుస్తాం.

ఈ పిలుపు తల్లీ బిడ్డ జీవితాంతం పంచుకునే అనుబంధానికి స్పష్టమైన సూచన. ప్రాచీన కాలం నుండి సమాజంలో మహిళలు పిల్లల సంరక్షకులుగా పరిగణించబడ్డారు. వారి విధి ఇంటికి, ఇంట్లోని వారిని జాగ్రత్తగా చూసుకోవడానికి మాత్రమే పరిమితమయ్యింది. దీంతో తల్లులు ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలనే ఈ భావన పిల్లలను వారి జీవితాల్లో, అభివృద్ధిలో సురక్షితంగా ఉంచింది. నేడు సమాజంలో తల్లులు ఇంటి పనుల నిర్వహణలోనూ, పిల్లల సంరక్షణలోనూ రెండు పాత్రలను పోషిస్తున్నారు. పిల్లల సంరక్షణలో తండ్రుల వాటా పెరిగినప్పటికీ మహిళలు ఇప్పటికీ వారి ఇంట్లో మొదటి సంరక్షకులుగా ఉంటున్నారు.

విజయవంతమైన మార్పు

ప్రపంచవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్ గురించి చేసిన అధ్యయనాల్లో దాదాపు 73 శాతం మంది మహిళలు 30 ఏళ్ల వయసులో తమ పిల్లలను చూసుకోవడానికి తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని, 27 శాతం మంది కొంతకాలం తర్వాత తిరిగి వచ్చారని గమనించారు. వారిలో దాదాపు 16 శాతం మంది తమ వృత్తిపరమైన పని జీవితంలో అధికారులుగా ఉన్నారు. కాబట్టి తల్లులుగా ఉన్న మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా మార్చుకుంటున్నారని కూడా స్పష్టమైంది. 'ఉద్యోగినిగా డబ్బు సంపాదిస్తూ పిల్లలకు కావల్సినవి సమకూర్చ గలుగుతున్నాను. కానీ, వారిని సక్రమంగా పెంచ గలుగుతున్నానా..' అనుకునే తల్లులకు సాంకేతికత వరంగా మారింది. సమయానుకూలంగా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎంచుకోవచ్చు.

హద్దులు అవసరం

పని, కుటుంబంతో పాటు వ్యక్తిగత అవసరాలకూ ప్రాముఖ్యం ఇవ్వండి. శారీరక, భావోద్వేగ శ్రేయస్సు కోసం స్వీయ సంరక్షణ అవసరం అనేది గుర్తుంచుకోవాలి. రోజులో పిల్లలకోసమే అన్నట్టుగా కొంత సమయం గడపండి. ఆ సమయంలో ఏదైనా పని నైపుణ్యాలు నేర్పించాలా, చదువు పట్ల దృష్టి పెట్టాలా, ఆనందంగా ఉంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలా.. ఇలా దేనికది బేరీజు వేసుకోవాలి. సహాయకులుగా ఉండేవారి మద్దతు ఎలా అందుతుందో చెక్ చేసుకోండి. వృత్తిపరమైన వృద్ధికి, తల్లి పాత్రకు విలువనిచ్చేవారిని సహాయకులుగా ఉండేలా చూసుకోండి. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి. ప్రతి ఒక్కరూ పనులు చేసేలా, బాధ్యత తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి.

– ప్రొ. పి.జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ నిపుణులు



సానుకూల ప్రభావాలు

- ఉద్యోగ తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో రెండు పని చక్రాలతో తమ జీవితాలు సజావుగా నడుస్తున్నట్టు చూస్తారు. ఉన్నత విద్యను పొందగల సామర్థ్యం, భౌతిక, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగల సామర్థ్యం కారణంగా వారు మరింత సంతృప్తికరమైన జీవితాలను గడుపుతారు. ఇప్పుడు ఉద్యోగాల్లోకి వెళ్లే మహిళలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కెరీర్ అవకాశాలను సరైన ప్యాకేజీలతో అందుకుంటున్నారు.
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ అధ్యయనం ప్రకారం పనిచేసే తల్లుల కుమార్తెలు వారి తల్లులకంటే 23శాతం ఎక్కువ సంపాదిస్తారని తెలిసింది. మరోవైపు పనిచేసే తల్లుల కుమారులు బాధ్యతాయుతమైన పెద్దలుగా ఎదుగుతారు. వారి ఆఫీసుల్లో లింగ సమానత్వాన్ని ఇష్టపడతారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను గౌరవిస్తారు. వారు భవిష్యత్తులో తమ కుమార్తెలకు అద్భుతమైన తండ్రులుగా కూడా పెరుగుతారు.
- తమ తల్లి జీవితంలోని దుఃఖకరమైన రోజులనూ చూసి ఉంటారు. అంతేకాదు తమ తల్లి పట్టుదల, దృఢ సంకల్పం వారు మానసికంగా, ఆర్థికంగా తమ సామర్థ్యాల మేరకు తమను తాము ముందుకు తీసుకెళ్లేలా చేస్తాయి. అన్నింటికంటే వారు హీరోలలో తమ తల్లిని ఒక షీ-రో గా చూస్తారు.

మెరుగైన సమయ నిర్వహణ

- పనిచేసే తల్లులు ప్రతిరోజూ తమ పిల్లలతో కనీసం ఒకటి లేదా రెండు గంటలు గడపగలిగేలా సమయాన్ని ప్లాన్‌చేసుకోవాలి. ఇది ఒక దినచర్యగా అనుసరించాలి. వేర్వేరు పనులను షెడ్యూల్ చేయడం, వాటిని సమయానికి పూర్తి చేయడం అనే మీ అలవాటు మీ పిల్లలు అదే అడుగు జాడల్లో నడవడానికి ఒక ఉదాహరణగా ఉపయోగపడుతుంది.
- పిల్లలు టైమ్‌టేబుల్‌కు కట్టుబడి ఉండటానికి కూడా ప్రోత్సహిస్తుంది. పిల్లలు మీ పనిని పూర్తి చేయడంలో సహకరిస్తున్నందుకు మీకు సంతోషాన్ని కలిగిస్తుంది.
- కాలక్రమంలో పిల్లల సమయ నిర్వహణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఇది వారి మెరుగైన జీవితానికి సహాయపడుతుంది. అంతేకాదు, పిల్లలతో మరింత నాణ్యమైన సమయాన్ని గడపడానికి సహాయపడుతుంది.



దివ్య మిట్టల్

అమ్మా, నువ్వే నా హీరో..

నా పెద్ద కూతురికి 8 ఏళ్లు. ప్రపంచం గురించి ఇప్పటికే భిన్నమైన ఆలోచనలను చేస్తుంటుంది. ఎదిగే క్రమంలో ఆమె ఆలోచనల కాంతిని మసకబారనివ్వం. కొన్నిసార్లు పని ఒత్తిడిలో చాలా అలసిపోయినట్టుగా ఉంటుంది. ఆ అలసటలో ఏడుపు వచ్చేస్తుంటుంది కూడా. అలాంటప్పుడు నా కూతురు నన్ను కౌగిలించుకుని, 'నువ్వు నా హీరోవి' అని చెబుతుంది. అంటే, పిల్లలు మనల్ని గమనిస్తారు. వారు మన వైఫల్యాల నుండి దృఢంగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. పడిపోవడం సహజమే అని ఆమెకు చూపించండి, ఆపై లేవండి. నా ఉద్యోగం నాకు ఇది నేర్పింది. ఏది జరిగినా నువ్వు స్థిరంగా ఉంటావని చూపించండి. మాతృత్వంలో తమకు తాము వేసుకునే ప్రశ్నల్లో కొంత అపరాధ భావనతో నిండి ఉంటాయి. నేను పిల్లలకు సరైనదే ఇస్తున్నానా, ఏమైనా తప్పులు చేస్తే.. ఇలాంటివి తలెత్తుతుంటాయి. కానీ, తెలుసుకోవాల్సింది ఏంటంటే మీరు మీ సొంత మార్గంలో ప్రయాణిస్తూ ఆమె దేనినైనా వెంబడించగల ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని గుర్తించాలి. తనను తాను క్షమించుకుంటూ ముందుకు సాగడం కూడా చాలా ముఖ్యం. మీకు ఒకరి కంటే పిల్లలు ఎక్కువమంది ఉంటే ఆ బాధ్యత పది రెట్లు పెరుగుతూనే ఉంటుంది. అందుకని, పిల్లలను ప్రేమించడం కంటే కూడా న్యాయంగా ఉండడటం ముఖ్యం.


– దివ్యా మిట్టల్

రోజువారీ జీవన విధానంలో ముఖ్యమైన వాటికి సమయం ఇస్తూ, తమ పనిని బ్యాలెన్స్ చేసుకుంటూ, చేస్తున్న పని గురించి పిల్లలకు క్లారిటీ ఇవ్వడం వల్ల మెరుగైన ప్రయోజనాలను పొందుతారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యుక్త వయసు

తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతుంటారు.
పిల్లలు చదువులతో కష్టపడాలి వాస్తవంగా.
కాని వారికి సోషల్ మీడియాలోని
చెత్తా చెదారం, తప్పుడు సమాచారం,
ఉద్రిక్త ఆకర్షణలు, హింసాత్మక భావజాలాలు...
ఇవి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.
ఇటీవల వచ్చిన 'అడోలసెన్స్' వెబ్‌సిరీస్
మీద సర్వత్రా చర్చ జరుగుతున్నది.
ఇది హెచ్చరిక అంటున్నారు.
ఈ సిరీస్ మనల్ని ఎలా నిద్ర లేపుతున్నది?



డిజిటల్ లోయల్లో టీనేజ్ పిల్లలు

మీ పిల్లలు మీతో ఇంట్లో మాట్లాడే భాష మీకు తెలుసు. వాళ్లు సోషల్ మీడియాలో మాట్లాడే భాష మీకు తెలుసా? వాళ్లు ఉపయోగించే 'ఎమోజీ'ల అర్థాలు తెలుసా? మాటలు లేకుండా ఎమోజీలతో గాయపరిచే వీలు ఉంటుందని తెలుసా? కిడ్నీ బీన్స్, రెడ్ పిల్, బ్లూ పిల్, డైనమైట్, రెడ్ హార్ట్, పర్పుల్ హార్ట్, ఎల్లో హార్ట్.... ఈ ఎమోజీల అర్థం ప్రతి దానికీ మారుతుంది. అవి ఎందుకు ఉపయోగిస్తున్నారు. ఇంట్లో మన ఎదురుగా పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసు. సోషల్ మీడియాలో ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసా?

ముఖ్యంగా వారి వయసు 12- 14 సంవత్సరాల మధ్య ఉంటే వారికి తెలిసింది ఎంత... తెలియంది ఎంత... తెలిసీ తెలియంది అంత.

జాగ్రత్త సుమా... అని హెచ్చరించడానికి వచ్చింది 'అడోలసెన్స్' అనే వెబ్ సిరీస్.

ఎవరు నిందితులు?

సోషల్ మీడియాను, ఎమోజీలను కనిపెట్టిన వారా? వాటిని ఫోన్లకు అనుసంధానం చేసిన వారా? పిల్లలకు ఫోన్లు కొనిచ్చిన తల్లిదండ్రులా? వాళ్లు ఏ మీడియాను ఉపయోగిస్తున్నారో చూడని తల్లిదండ్రుల నిర్బాధ్యతా? వారితో గడపలేని బిజీతో ఉన్న తల్లిదండ్రుల నిర్లక్ష్యమా? సరిగా పెంచని, సరిగా విద్యాబుద్ధులు చెప్పని వారంతా ఇందుకు బాధ్యులు కాదా? సమాజంలో పేరుకున్న హింసా ప్రవృత్తిని దూరం చేయలేని పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, పౌర వ్యవస్థలో ఉన్న వీరంతా కాదా బాధ్యులు.

నాలుగు ఎపిసోడ్స్‌ల సిరీస్

'అడోలసెన్స్' అనేది నాలుగు ఎపిసోడ్ల మినీ వెబ్ సిరీస్. బ్రిటిష్ క్రైమ్ డ్రామా. బ్రిటన్‌లో టీనేజీ పిల్లల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తిని గమనించి ఈ సిరీస్‌ను తీశారు. జాక్ థోర్న్ స్క్రిప్ట్ రాస్తే, ఫిలిప్ బరాన్‌టిని దర్శకత్వం వహించాడు. ఒక్కో ఎపిసోడ్ ఒక గంట ఉంటుంది. విశేషం ఏమిటంటే ప్రతి ఎపిసోడ్ సింగిల్ షాట్. అంటే మధ్యలో కట్ లేకుండా కెమెరా కదులుతూ దృశ్యాలను చూపుతూ వెళుతుంది. ఈ మేకింగ్‌లో వినూత్నత వల్ల కూడా ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది.

ఆ పసివాడి సంఘర్షణ

ఈ సిరీస్ మొదలు కావడమే 'జెమీ మిల్లర్' అనే 13 ఏళ్ల పిల్లవాడి అరెస్టుతో మొదలవుతుంది. ముందు రోజు రాత్రి స్కూల్లో తన క్లాస్‌మేట్ అమ్మాయి కేటీని కత్తితో ఏడుసార్లు పొడిచి చంపాడని అభియోగం. తండ్రి, తల్లి, సోదరి హడలిపోతాడు. జెమీ మిల్లర్ అయితే పోలీసులను చూసి ప్యాంట్ తడుపుకుంటాడు. ఆ తర్వాత జెమీనే కేటీని చంపాడని ఇందుకు ఒక స్నేహితుడు కూడా పురిగొల్పాడని విచారణలో ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. అయితే ఇందులో ఎవరి తప్పు ఎంత? దీనికి బాధ్యులు ఎవరెవరు? శిక్ష మాత్రం ఒక్కడికే పడబోతోందా?

ఇన్‌స్టా గొడవ

జెమీ వయసు 13 ఏళ్లే అయినా అతనికి ఇన్‌స్టా అకౌంట్ ఉంది. అందమైన ఫిమేల్‌మోడల్స్ బొమ్మలను అప్పుడప్పుడు షేర్ చేస్తుంటాడు. అతని పోస్టులకు కేటీ కామెంట్స్ పెడుతూ ఉంటుంది. వాటికి రకరకాల ఎమోజీలు వాడుతుంటుంది. అవి జెమీని బాధ పెట్టాయని మనకు తెలుస్తుంది. జెమీ తన వయసులో అపరిపక్వత వల్ల తను ఆకర్షణీయంగా లేదని తనను ఎవరూ ఇష్టపడరని న్యూనతతో ఉంటాడు. కేటీ కామెంట్స్ ఇందుకు ఆజ్యం పోస్తాయి. అంతే కాదు సాటి మనిషి పట్ల, ఆడపిల్లల పట్ల సెన్సిటివ్‌గా ఉండాలనే భావజాలం కాకుండా వాళ్లను ఏమైనా అనొచ్చు ఎలాగైనా ఉండొచ్చు అనే ఆధిపత్యపు భావజాలమే ఎక్కువగా జెమీకి పరిచయం అవుతుంటుంది. వీటన్నింటి దరిమిలా అతడు కేటీ ప్రాణం తీసేవరకూ వెళతాడు.

టీనేజ్ పిల్లలు ఎంతో సున్నితమైన దశలో ఉండే సీతాకోక చిలుకలు. వారిని గురించి అందరికీ బాధ్యత ఉండాలని చెబుతోంది ఈ సిరీస్. ఇందులోని ముఖ్య పాత్రను ఒవెన్ కూపర్ అనే బాల నటుడు అద్భుతంగా పోషించాడు. దిన పత్రికల వార్తలు కూడా మనకు రోజూ టీనేజ్ పిల్లల సమస్యలు, కుటుంబాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లోపం పట్టి ఇస్తున్నాయి. తల్లిదండ్రులు ఈ సిరీస్ చూడటం మంచిదంటున్నారు అభిరుచి ఉన్న ప్రేక్షకులు. కొందరైతే టీనేజ్ పిల్లలతో పాటుగా తల్లిదండ్రులూ చూడాలని సూచిస్తున్నారు. ముందు పెద్దలు చూడండి. ఆ తర్వాత మీకు సబబని అనిపిస్తే పిల్లలకు చూపించండి. కానీ ఆలోచించండి.

బ్యూటీ

నిర్లక్ష్యమే అసలైన సమస్య

అందంగా ఉండటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనేది అందరూ అంగీకరించాల్సిందే. యవ్వనంగా కనిపించాలనే తాపత్రయంతోనే జీవనం నాణ్యంగా గడపడానికీ ప్రయత్నించాలి. అందుకు బ్యూటీ చికిత్సలకు ఎక్కువ ఖర్చు పెట్టనవసరం లేదు. నేటి రోజుల్లో కాలుష్యం, సమతుల ఆహార లోపం, స్ట్రెస్ .. వీటన్నింటి ప్రభావం చర్మంపై పడుతుంది. అందుకని సమస్య ఎక్కడ ఉన్నదో దానిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

చాలా మంది ఎదుర్కొనేవి...

యవ్వనంలో ఉన్నవాళ్లైతే యాక్నె, మంగు మచ్చలు, కాస్మొటిక్స్ వాడకం వల్ల ఏర్పడే మచ్చల సమస్య ఉంటుంది. వీటికి ఇంట్లోనే సొంత చికిత్సలు తీసుకోవడం వల్ల మరికొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు.. మొటిమలకు వెల్లుల్లి, టూత్‌పేస్ట్ వంటివి వాడుతుంటారు. మంగు మచ్చలకు తమకు తామే స్టెరాయిడ్స్ వాడుతుంటారు. ఇక శిరోజాల విషయంలో అయితే ఐరనింగ్, స్ట్రెయిటనింగ్, స్టయిలింగ్.. వంటి హెయిర్‌స్టైల్స్ ఎక్కువైపోయాయి. వీటివల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. జుట్టు ఊడిపోవడం పెరుగుతుంది.



బట్టల వల్ల అలెర్జీ

టైట్‌గా ఉండే బట్టలు వేసుకుంటుంటారు. ఫ్యాబ్రిక్ వల్ల దురద సమస్యలు వస్తుంటాయి. అవి, నిర్లక్ష్యం చేస్తే కుటుంబంలో మిగతా వారికీ ఆ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుంది. పులిపిర్లు ప్రైవేట్ పార్ట్స్‌లో వస్తుంటాయి. వాటినీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్మొటిక్ ప్రయోగాలు అయితే చెప్పలేం. అవి తమ చర్మానికి సరిపడతాయో లేదో కూడా చూడరు. దీని వల్ల చర్మం రంగు మారుతుంది.

ఫేషియల్స్

ఫెషియల్స్ చేయించుకుంటుంటారు. ఫ్రూట్ ఫేషియల్స్ సాధారణ కాంతికి పనిచేస్తాయి. హైడ్రా ఫేషియల్, డెర్మాఫేషియల్స్, కెమికల్ పీల్.. వంటి ఫేషియల్స్ నిపుణుల పర్యవేక్షణలోనే చేయించుకోవాలి. హెయిర్‌కి, స్కిన్‌కి పీఆర్‌పీ చేయించుకుంటారు. ఇవి చేయించుకున్నంత మాత్రాన అంతా బాగయిపోదు. సరైన మెయింటెనెన్స్ అవసరం.

చెయిన్లతో మెడపై నలుపు

ఆడవాళ్లలో చాలా వరకు మెడపైన నల్లగా అవుతుంది. ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, శుభ్రత పాటించకపోవడం, అధికబరువు వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అండర్ ఆర్మ్స్ డార్క్‌గా ఉన్నప్పుడు నిపుణుల సూచనలు తీసుకోవాలి. అధికబరువుకు లైపోసక్షన్ వంటివి చికిత్సలు తీసుకుంటారు. బరువు తగ్గినప్పుడు ఎలాంటి ఫిట్‌నెస్ సూచనలు పాటించాలో కూడా నిపుణుల సూచనలు తీసుకోవాలి.

స్ట్రెచ్ మార్క్స్

మహిళలకు ప్రసవం తర్వాత స్ట్రెచ్ మార్క్స్ పెద్ద సమస్య. ప్రసవం తర్వాత మూడవ నెల వరకు క్రీములు వాడుతూ ఉండాలి. అన్ని డెలివరీలు పూర్తయ్యాక స్ట్రెచ్ మార్క్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మరో సమస్య పాదాల పగుళ్లు. క్రీమ్ వాడితే దాని మీద దుమ్ము పేరుకుంటుంది. అందుకని, రాత్రి పడుకునేముందు పాదాలను శుభ్రం చేసి, క్రీమ్ రాసి, సాక్సులు ధరించాలి.

డిటర్జెంట్స్ వల్ల ఎగ్జిమా!

చేతులకు ఎగ్జిమా వస్తుంది. డిటర్జెంట్స్ వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అందుకని ఇంటి క్లీనింగ్‌లో చేతులకు గ్లౌజ్స్ మోచేతుల వరకు ఉండేవి మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించాలి.

పర్మనెంట్స్ చేయించుకుంటున్నారా..!

బ్యూటీ చికిత్సలలో పర్మనెంట్ మెథడ్స్‌కి ఇటీవల డిమాండ్ పెరిగింది. వాటిలో బొటాక్స్, ఫిల్లర్స్, స్కిన్ బూస్టర్స్, లిప్ కరెక్షన్, స్కిన్ టైటెనింగ్, గ్లోయింగ్ కోసం తీసుకునే ఇంజక్షన్స్.. ఈ కాస్మొటిక్స్ చికిత్సలన్నీ వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. రెగ్యులర్ మేకప్ చేసుకునేవారు కాస్మొటిక్స్ తమ చర్మతత్వానికి సరిపడేవి ఎంచుకోవాలి. తిరిగి శుభ్రం చేసుకోవడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.



– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్

ఫ్యాషన్

ప్రకృతి పరవశం

పచ్చని తోరణాలు.. షడ్రుచుల ఆస్వాదన.. సంప్రదాయ వస్త్రధారణ
ఉగాదికి స్వాగతం పలుకుతూ
కొత్త ఉత్సాహాన్ని మదికి మోసుకువస్తాయి.
చేనేత చీరలు, ఎంబ్రాయిడరీ సొగసులు వాటి రంగుల హంగులు
ప్రకృతి పరవశించేలా పండగకు మరింత శోభను తీసుకువస్తాయి.
ముఖ్యంగా పసుపు, ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు రంగులు
పండగ కళను రెట్టింపుగా మన కళ్లకు కడతాయి.



డిజైన్లు

చెక్స్, లైన్స్‌తో ఉన్న డిజైన్లు, మెరుపులు లేకుండా థ్రెడ్ ఎంబ్రాయిడరీ వర్క్, సహజంగా అనిపించే పెయింటింగ్స్ ఈ పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

చేనేత కళ

పండగ నాడు కళను రెట్టింపు చేసే అలంకరణకు ప్రాముఖ్యత ఇస్తుంటారు. అయితే, అందుకు పెద్ద హడావిడి లేకుండా మనవైన చేనేతలలో కాంతిమంతమైన రంగులున్న చీరలను ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో కంచిపట్టు చీరల నుంచి కలనేత వరకు అన్నీ పండగను వెలిగించేవే.

సహజమైన రంగులు

ప్రకృతి నేపథ్యంగా ఉగాది జరుపుకుంటారు కాబట్టి పసుపు, ఆకుపచ్చ, నారింజ, ఎరుపు రంగుల కాటన్, తెలుపు, ఎరుపు కాంబినేషన్, పింక్ కలర్ టస్సర్, సిల్క్ చీరలు ప్రత్యేక ఆకర్షణతో ఆకట్టుకుంటాయి.

ఇతర అలంకరణలు..

- చీరలకు లాంగ్ స్లీవ్స్ బ్లౌజులు, టెంపుల్ జ్యువెలరీ లేదా థ్రెడ్, టెర్రకోట జ్యువెలరీ బాగుంటాయి.
- పసుపు, ఎరుపు కాంబినేషన్ ప్లెయిన్ గాజులు, సహజంగా అనిపించేలా తక్కువ మేకప్ ప్రత్యేకతను చూపుతుంది.
- శిరోజాల అలంకరణలో జడ, కొప్పులు, పువ్వులకు ప్రాధాన్యమిస్తే పండగ ప్రకృతి కళతో ఆకట్టుకుంటుంది.



